www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 18 నవంబర్ 2025

మారుతి ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక మిట్స్ యూనివర్సిటీలో సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిషన్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వి.మారుతి ప్రసాద్‌కు చెన్నై సత్యభామ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డాక్టర్ పట్టాను ప్రదానం చేసిందని మిట్స్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లోని కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం నుంచి పిహెచ్‌డి డిగ్రీ పొందినట్లు, అక్కడే పనిచేస్తున్న ప్రొఫెసర్ బి. భారతి పర్యవేక్షణలో 'యాన్ ఇంటెలిజెంట్ మల్టీమోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐఓటి' అను అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టర్ పట్టాను అందజేసినట్లు ఆయన తెలిపారు. మారుతీప్రసాద్‌ను యూనివర్సిటీ ఫౌండర్, ఛాన్సలర్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ప్రో ఛాన్సలర్ యెన్.ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, అధ్యాపకులు, అభినందనలు తెలియజేశారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

తాగేందుకు గుక్కెడు నీళ్ల లేక అవస్థలు పడుతున్నామని గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించి ఆదుకోవాలంటూ సోమవారం మండలంలోని మాలేపాడు పంచాయతీ, కత్తివారిపల్లి గ్రామస్తులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు నాగరత్నమ్మ, కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కత్తివారిపల్లిలో సుమారు 85 కుటుంబాలు నివాసాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న మంచినీటి బోరు ఆరు నెలల కిందట చెడిపోవడంతో ఇబ్బందులు తలెత్తాయన్నారు. అప్పటినుంచి నీటి కోసం నానా తంటాలు పడుతున్నామని, నాయకులకు మొరపెట్టుకున్నా, అధికారులను ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో రైతుల బోర్లు వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గంటల తరబడి బోర్ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందని, అది కూడా రైతు దయ తెలిస్తేనే ఒక్కో కుటుంబానికి ఒక్క బిందె నీళ్ల మాత్రమే దొరుకుతు న్నాయన్నాయని వాపోయారు. ఒక్క బిందె నీటితో ఇండిళ్లిపాది ఎలా సర్దుకో వాలో అధికారులే చెప్పాలన్నారు. అత్యవసరమైతే రూ.800 ఖర్చు పెట్టి ట్యాంకర్ నీళ్ల కొనుగోలు చేస్తున్నామని, అవి కూడా సకాలంలో దొరికే పరిస్థితి లేదని వాపోయారు. కత్తివారిపల్లెలో పర్యటించిన అధికారులు రెండు నెలల కిందట బోరు వేసినా అందులో నీళ్ల పడకపోవడంతో మిన్నకుండిపోవడం ఇంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. గ్రామంలో తాగునీటి బోరు వేసే వరకు ప్రత్యామ్నాయంగా పంచాయతీ నుంచి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వెంటనే బోరును వేసి, ప్రతి వీధికి కుళాయిల ద్వారా వీటి సరఫరా చేయాలని కోరారు. గ్రామంలో అధికారులు పర్యటించి ప్రభుత్వ ఇళ్ల మంజూరు చేయాలని, రోడ్లు, కాలువలు నిర్మించి వీధి లైట్లు వేసి తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసులు, రేణుక గ్రామస్థులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు, గ్రామస్తులు

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

పిజిఆర్ఎస్ అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సకాలంలో, నాణ్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ఇటీవల ముఖ్య మంత్రి చిన్నమండెం పర్యటన సందర్భంగా వచ్చిన అర్జీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి అర్జీదారునితో మాట్లాడి సంతృప్తికరంగా నాణ్యతతో పరిష్కరించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తుందని, ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని ఆదేశిచారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని సూచించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జాయింట్ కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు అర్జీలు సమర్పించారు. సదరు సమస్యలన్నింటిని నిర్ణీత గడువుగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, జిఎస్‌డబ్ల్యూఎస్ లక్ష్మీపతి, డిపిఒ రాధమ్మ, హౌసింగ్ పీడీ కె.రమేష్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న జెసి ఆదర్శ్ రాజేంద్రన్

కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి : వ్య.కా.స

ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజలు, నాయకులు

ప్రజాశక్తి- గాలివీడు

అరవీడు గ్రామ పధిలో ఉన్న జగనన్న కాలనీలో తక్షణం మౌలిక వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మండెం సుధీక్‌కుమార్ డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలో, తక్షణం మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ, బాధితులతో కలిసి వ్య.కా.స ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.అనంతరం సమస్యల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల అభివృద్ధి అధికారికి సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ 2021లో అప్పటి వైసిపి పభుత్వం సుమారు వంద కుటుంబాలకు ఇంటి స్థలాలు, ఇళ్ల మంజూరు చేసిందని చెప్పారు. మంచినీటి సౌకర్యం, వీధిలైట్లు, సిమెంటు రోడ్లు వంటి మౌలిక వసతులను కల్పించడం విస్మరించిందని చెప్పారు. ఆ కారణంగా లబ్ధిదారులు అక్కడ నివాసాలు ఉండడానికి మక్కువ చూపడం లేదని చెప్పారు. లబ్ధిదారులు ఎన్నో కష్టాలు పడి ఇంటిని పూర్తి చేసుకున్నప్పటికీ, కనీస సౌకర్యాలు లేని కారణంగా, బాడుగ ఇళ్లల్లోనే కాలం వెల్లదీసే పరిస్థితులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాలనీలో నివాసం ఉంటున్న వారు వీధి విద్యుత్ దీపాలు లేని కారణంగా, విషపురుగుల బెడదతో ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని జీవనం సాగిస్తున్నారని వాపోయారు. తీవ్రమైన మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రూ. వెయ్యి వెచ్చించి మంచి నీటిని కొనుగోలు చేసుకునే దుర్భర పరిస్థితిని అధికారులు కల్పించడం అత్యంత దుర్మార్గమని తెలిపారు. కాలనీవాసులు తమ పనులను ముగించుకొని రాత్రులకు వెళ్లాలంటే కాలనీ సమీపాన బస్ స్టాపింగ్ లేనందున ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ సమస్యలన్నింటిపై స్పందించిన ఎంపిడిఒ చంద్రమౌళి, ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని ఏర్పాటు చేసే అవకాశం ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వ పరంగా లేకపోయినప్పటికీ, కాలనీలోని మంచినీటి బోరు మోటారు రిపేరు చేయించేంతవరకు సొంత ఖర్చులతో కాలనీవాసుల మంచినీటి కొరతను తీరుస్తానని హామీ ఇచ్చారు. బస్సు స్టాప్ ఏర్పాటు, వీధిలైట్లు, వీధుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం, వంటి సమస్యలను జిల్లా పంచాయతీల అధికారి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం చూపుతామని చెప్పారు. ఎంపిడిఒ హామీ మేరకు ఆందోళనకారులు ధర్నా కార్యక్రమాన్ని విరమింప చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం గాలివీడు మండల నాయకులు సి.వీరభద్ర, పి.వెంకటరమణ, ఇస్మాయిల్, జమ్రుద్,ఎన్ ప్రసాద్‌తోపాటు, కాలనీ నివాసులు మహబూబ్ బాషా, ఇస్మాయిల్, వెంకటేశు, విజయ్, షాహిదా బేగం, వెంకటరమణ, అమీనాభి, ఖాదర్‌వలీ, ప్రజలు పాల్గొన్నారు.

న్యాయవాదుల హక్కుల కోసం నిరంతర పోరాటం

- ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు అజయ్‌కుమార్

మాట్లాడుతున్న ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు అజయ్‌కుమార్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలోనూ, దేశంలోనూ అపరిష్కృతంగా ఉన్న న్యాయవాదుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికలు సందర్భంగా అన్నమయ్య, కడప జిల్లాలలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రాయచోటి న్యాయవాదులను ఉద్దేశించి లక్ష్మీపురంలోని కోర్టు ఆవరణంలో మాట్లాడుతూ 1982లో జస్టిస్ కృష్ణయ్యర్ ఆధ్వర్యంలో దేశంలో ఏర్పడిన భారత న్యాయవాదుల సంఘం అప్పటి నుంచి న్యాయవాదుల సమస్యల పట్ల అంకితభావంతో పనిచేస్తూ రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవా భవంతో ముందుకు కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్రంలోని న్యాయవాదుల అనేక సమస్యలను పరిష్కరించడంలో ఐఎఎల్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా కృషి చేస్తుందని, న్యాయవాదులు తమకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చి బార్ కౌన్సిల్ సభ్యులుగా మళ్లీ తనను గెలిపించినట్లయితే న్యాయవాదుల హక్కుల కోసం మరింతగా కృషి చేస్తానని న్యాయవాదులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రిటైర్డ్ జడ్జి ఇస్మాయిల్, కడప ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సుబ్రహ్మణ్యం వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆనంద్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ మిఠాయిగిరి ఖాదర్‌బాషా, రామకొండయ్య, రాయచోటి బార అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి బాషా, ఉపాధ్యక్షులు ధనుంజయ్ కుమార్, ట్రెజరర్ ఆదిరెడ్డి నాయక్, రాయచోటి న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎరుకల హక్కుల సాధనకు పోరాటం

- ఎపి ఎరుకుల డెవలప్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రెడ్డిశేఖర్

ప్రజాశక్తి- రాయచోటి

రాష్ట్రంలో ఎరుకల హక్కులపై రాజీలేని పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఎరుకల డెవలప్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పూజారి రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో ఎన్‌జిఒ హోమ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డిశేఖర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఉన్నటువంటి ఎరుకుల కాలనీలలో ఉన్న విద్య, వైద్యం, ఉపాధి, ఎరుకుల విద్యార్థుల సమస్యలు, ఎరుకుల జాతి హక్కుల పైన రాజీలేని పోరాటాం చేస్తామని చెప్పారు. జిల్లాలో సొంత ఇల్లు లేని నిరుపేదలకు ఎరుకుల కాలనీలు, రాయచోటి పట్టణంలో ఎరుకుల కుల దైవం అయిన ఏకలవ్యుని విగ్రహ ప్రతిష్ట, ఏకలవ్య ప్రభుత్వ పాఠశాల వీటన్నిటిని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎపి ఎరుకల డెవలప్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పూజారిరెడ్డి శేఖర్ సమక్షంలో సోమవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కంపా జనార్ధన్, జిల్లా ఉపాధ్యక్షులుగా కంపా రవణయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కంపా శేఖర్, జిల్లా సహాయ కార్యదర్శిగా బుడిగి హరినాథ్ ను ఎన్నుకున్నారు. కార్య క్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సేలం శివయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పోల వెంకట రమణ, రాష్ట్ర కోశాధికారి పూజారి నాగన్న, రాష్ట్ర సహాయ అధికారి ఓబిలి శివయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాగల అరుణ, నాయకులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న గిరిజన నాయకులు

ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ బృందం

సమగ్ర సస్యరక్షణతో మంచి ఫలితాలు

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

రైతులు పంటలసాగులో జాగ్రత్తలు పాటించాలని, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో కొర్లకుంట గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రత్యేక శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొర్లకుంటలో ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు వారం రోజులపాటు అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. సామాజిక సేవతో రైతులకు సంబంధించిన అనేక అంశాల్లో సందేహాలు తీర్చారన్నారు. డాక్టర్ సయ్యద్ సదరున్నీషా పెరటి తోటల సాగు పద్ధతులు, కూరగాయల సాగును వివరించారు. డాక్టర్ ఎం.రాజానాయక్ అరటి, మామిడి, బొప్పాయి సాగులో తీసుకోవాల్సిన పద్ధతుల్లో, తెగుళ్ల నివారణ చర్యలు వివరించారు. అంతకు ముందు ఉదయం గ్రామంలో నీటి కాలుష్యం పైన ఎన్ఎస్ ఎస్ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎ. నిశ్చల, డాక్టర్ బి.హరి మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

30లోగా హౌసింగ్ ఆన్‌లైన్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - వీరబల్లి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన యాప్ ద్వారా 30వ తేదీలోగా పక్కా గృహాలు కోసం అర్హులైన లబ్ధిదారులకు ఆన్‌లైన్ పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఎంపిడిఒ గౌస్ బాషా, హౌసింగ్ ఎఇ వెంకటేష్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆవాస్ యాప్ ద్వారా నియమించిన అధికారి సర్వే చేయించుకుని, యాప్ ద్వారా మీరు ఇల్లు కట్టుకునే ప్రదేశాన్ని జియో టాకింగ్ ఫొటో తీయించుకోవాలని పేర్కొన్నారు. సోమవరం గ్రామానికి హౌసింగ్ ఎఇ, ఓదివీడుకు తులసయ్య, పెద్దవీడుకు షేక్ సాబుద్దీన్, సానిపాయికి రెడ్డయ్య, తాటిగుంటపల్లికి రాచరాయుడు, మట్లికి పవన్ కుమార్‌రెడ్డి ,గుర్రప్పగారిపల్లికి మారుతి, వీరబల్లికి సురేష్‌కుమార్, వంగిమళ్ళకు సుమలత, దిగువరాచపల్లికి సుమలత, గడికోటకు నరేష్ అధికారులను నియమించారని వారిచే సర్వే చేయించుకోవాలని పేర్కొన్నారు. హౌసింగ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.1.20 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. అదనంగా ఉపాధి హామీ ద్వారా 90 పని దినాల కింద రూ.27 వేలు, టాయిలెట్ నిర్మాణానికి రూ.12 వేలు అదనంగా అందజేస్తారన్నారు. బిసి, ఎస్‌సిలకు రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ. 75 వేలు ప్రభుత్వం అదనపు సాయం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి రూ.లక్ష వచ్చే అవకాశముందన్నారు. అర్హులు తప్పక దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఆధార్‌కార్డులు, రేషకార్డు, పొజిషన్ సర్టిఫికెట్, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జాబ్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం ఉండాలన్నారు. ఆధార్, మొబైల్ నంబర్ సీడింగ్ తప్పనిసరిగా చేయాలని తెలిపారు.

మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పి.వి.రమణ

ప్రజాశక్తి-రాజంపేట

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రాజంపేటకు చెందిన పి.వి.రమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న ఒంగోలులో నిర్వహించిన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలలో ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు రాజంపేట నుంచి పి.వి.రమణను రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకుని ప్రకటించినట్లు పేర్కొన్నారు.

పి.వి.రమణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్ బాష

మౌజన్, ఇమాంలకు వేతన బకాయిల విడుదల

- హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మౌజన్, ఇమాంలకు వేతన బకాయిలు విడుదల కావడంతో ఎమ్మెల్యే షాహహాన్ బాష హర్షం వ్యక్తం చేశారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి, మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మసీదుల్లోని మౌజన్, ఇమాంలకు గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న బకాయిల వేతనాలు విడుదల చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐదు వేల మసీదులకు రూ. 90 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు.ఇందులో అన్నమయ్య జిల్లాలోని 263 మసీదులకుగాను రూ.4.73 కోట్లు, మదనపల్లె నియోజకవర్గంలోని 33 మసీదులకు నెలకు ఒక్కొక్క మసీదుకు రూ. 15 వేల చొప్పున ఏడాదికి రూ. 1.80 లక్షలు కేటాయించారని చెప్పారు. అనుభవం, ముందు చూపు కలిగిన ముఖ్యమంత్రి ఉంటే రాష్ట్రంలో సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయో, అభివృద్ధి ఎంత వేగంగా జరుగుతుందో కూటమి ప్రభుత్వం పనితీరే నిదర్శనమన్నారు. పలమనేరులో మిస్బా అనే విద్యార్థికి స్థలం కేటాయిస్తూ న్యాయం చేసిన తెలుగుదేశం పార్టీకి, సిఎం నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మైనార్టీ పెద్దలు ఎమ్మెల్యేను దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎస్.ఎ. మస్తాన్, ఎస్.ఎం.రఫీ, ఎస్.రెడ్డి షంషేర్, అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ గౌస్ మొహిద్దీన్, మైనార్టీ నాయకులు ఇంతియాజ్, దాదు, మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఆకట్టుకున్న కవి సమ్మేళనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 4వ రోజైన సోమవారం గ్రంథాలయాధికారి వసంతకుమారి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి మదనపల్లె రచయితలు సంఘం ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధరాచారి, సాయి చైతన్య, కళాశాల చైర్మన్ డాక్టర్ నిర్మల్ కుమార్ రెడ్డి, డాక్టర్ అప్సర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్సర్ విద్యార్థినులకు చిన్న, చిన్న కథలతో వారి విద్యాభ్యాసం ఎలా ఉండాలో వివరించి చెప్పారు. శ్రీసాయి చైతన్య కళాశాల చైర్మన్ నిర్మల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాభ్యాసం కాలంలో తాము గ్రంథాలయాలను ఏవిధంగా ఉపయోగించుకున్నది తెలియజేశారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు పక్కన పెట్టేసి సెలవులు, ఖాళీ సమయంలో గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. లింగాల యుగంధరాచారి అధ్యక్షతన జరిగిన కవితోత్సవంలో భాగంగా కవులైన లింగాల యుగంధరాచారి, శరత్ బాబు, రామ్మోహన్ నాయుడు, రామ్మోహన్‌రెడ్డి, నాగభూషణం రావు, హేమలత, లక్ష్మీ ప్రసన్న, కుమారస్వామి,రాఘవేంద్ర బాబు, ఖాదర్ భాషా, కవులు, కవయిత్రిలు తమ తమ కవితలతో పిల్లలను పాఠకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో శ్రీసాయి చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ కుమార్‌రెడ్డి

జాతీయ జట్టుకు ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- పుల్లంపేట

జాతీయ జట్టుకు ఎంపికైన హర్షిత

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం విద్య నభ్యసిస్తున్న హర్షిత జాతీయస్థాయి బేస్‌బాల్ జట్టులోకి ఎంపికైందని ప్రిన్సిపల్ లీలా శ్రీహరి తెలియజేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైల్వే కోడూరులో ఈ నెల 15, 16, 17వ తేదీలలో ఎస్‌జిఎఫ్ అండర్-19 బేస్ బాల్ పురుషులు, మహిళల పోటీలను గవర్నమెంట్ జూనియర్ కళాశాల రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారని తెలిపారు. పోటీలలో 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని, కడప జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. కడప జట్టులో అద్భుత ప్రతిభ కనబరిచిన ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థి హర్షిత జాతీయ స్థాయిలో చోటు సంపాదించిందని స్కూల్ గేమ్స్ ఎస్‌జిఎఫ్ అండర్ - 19 సెక్రటరీ చంద్రమోహన్ రాజు చెప్పారు. జాతీయ జట్టులో చోటు సంపాదించుకోవడం పట్ల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్, అధ్యాపకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు

- బాలుర, బాలికల విభాగంలో విజేతలుగా శ్రీకాకుళం, కడప జట్లు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 15న ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్-19 బేస్‌బాల్ పోటీలు సోమవారం ముగిసాయి. ఈ పోటీలలో 13 జిల్లాల బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో శ్రీకాకుళం జట్టు విన్నర్స్ గాను, కర్నూలు జట్టు రన్నర్స్ గాను నిలిచారు. బాలికల విభాగంలో కడప జిల్లా జట్టు విన్నర్స్ గాను,గుంటూరు జట్టు రన్నర్స్ గాను నిలిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ యశోదర, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉమాశంకర్, బేస్బాల్ ఎపి టోర్నమెంట్ అబ్జర్వర్ దాదాపీర్, విశ్రాంత వ్యాయామ సంచాలకులు సుబ్బరాజు, శారద, విజయ ప్రసాద్‌రెడ్డి, కడప జిల్లా జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు నాగేశ్వర్‌రెడ్డి మురళీకృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, కడప జిల్లా బేస్బాల్ కోచ్ మేనేజర్లు, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల కోచ్ మేనేజర్లు పాల్గొన్నారని కడప జిల్లా ఎస్‌జిఎఫ్ అండర్-19 సెక్రటరీ చంద్రమోహన్‌రాజు పేర్కొన్నారు. అన్ని జిల్లాల నుంచి ప్రతిభ గల క్రీడాకారులను సెలక్షన్ కమిటీ చే ఎంపిక చేసిన 16 మంది క్రీడాకారులను బాలుర జట్టు గాను 16 మంది క్రీడాకారులను బాలికల జట్టుగాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేస్బాల్ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన ఆంధ్రప్రదేశ్ బాలబాలికల జట్లు 2026 జనవరి రెండవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు ఢిల్లీలో జరిగే 69వ జాతీయ బేస్‌బాల్ టోర్నమెంట్లో పాల్గొంటారని చంద్రమోహన్ రాజు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

బాలుర విభాగంలో గెలుపొందిన శ్రీకాకుళం జట్టు

బాలికల విభాగంలో గెలుపొందిన కడప జట్టు

డిఎంకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

బస్సు సర్వీసును పునరుద్ధరించండి

ప్రజాశక్తి - నందలూరు

నందలూరు రైల్వేస్టేషన్ నుంచి రాజంపేట రైల్వేస్టేషన్ వైపు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపార వేత్తలు, సాధారణ ప్రజలు రోజూ ప్రయాణించే ఆర్‌టిసి బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరుతూ స్థానికులు రాజంపేట ఆర్‌టిసి డిపో మేనేజర్ మాధవి లతకి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నందలూరు-రాజంపేట మధ్య నడిచిన ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు కళాశాలలకు వెళ్లడానికి, ఉద్యోగులు విధులకు చేరుకోవడానికి, వృద్ధులు, మహిళలు అత్యవసర సేవల కోసం ప్రయాణించే సందర్భాల్లో ప్రత్యామ్నాయ వాహనాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వినతి పత్రంలో వివరించారు. ముఖ్యంగా పేద కుటుంబాలకు ప్రయివేటు వాహన ప్రయాణం భారం అయ్యిందని, తోగురపేట, పాటూరు, నాగిరెడ్డిపల్లి నుండి విద్యార్థులు కాలేజీ, స్కూలుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. ఈ మార్గంలో బస్సు పునరుద్ధరణ అత్యవసరమని తెలిపారు. వినతి పత్రాన్ని స్వీకరించిన డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి సమస్యపై వీలైనంత త్వరగా బస్సు సర్వీసులను పునఃప్రారంభం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాచూరి మురళి, వీరబల్లి జయ కుమార్‌రెడ్డి, పఠాన్ మెహర్ ఖాన్, హ్యూమన్ రైట్స్ ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ డేవిడ్ కళ్యాణ్ రాజ్, కిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనేలమల్లేశ్వర స్వామి కుంభాభిషేకం

ప్రజాశక్తి- నిమ్మనపల్లి

తవళం గ్రామంలోని శ్రీ యోగ నేలమల్లేశ్వర స్వామి జలపూరిత కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఇఒ మంజుల తెలిపారు. కుంబాభిషేక ఉత్సవాల్లో ముఖ్యఅతిథులుగా శంకర భాస్కర, రాజన్న, సర్పంచ్ రెడ్డప్ప, రెడ్డిమోహన హాజరయ్యారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో స్వామికి జలపూరతి, కుంబాభిషేక మహోత్సవాన్ని ఆలయ ఇఒ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు శంకర స్వామి శాస్త్రి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఆలయ సమీపంలోని బహుదా ఉప నది అయిన కుమారనది నుంచి పవిత్రమైన జలాన్ని మేళతాలలు, వాయిద్యాలు, నాణ్యాలు, చెక్కభజనలు, కోలాటాలు, దేవర ఎద్దులు మధ్య అంగరంగ వైభవంగా తీసుకువచ్చి నేలమల్లేశ్వర స్వామికి అభిషేకించారు. జల పూరిత కుంభాభిషేక రూపంలో నేలమల్లేశ్వర స్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. వేల సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. చిన్నరెడ్డప్ప ఆధ్వర్యంలో ఉదయం నుంచి భక్తులకు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు రెడ్డి మోహన, సహదేవ కుంభాభిషేకం ఉత్సవాన్ని పర్యవేక్షించారు. స్వామి వారి ప్రత్యేక పూజలలో జడ్‌పిటిసి ప్రమీల ఆర్ఐ రమణారెడ్డి, టిడిపి నాయకులు రాటకొండబాబురెడ్డి, శ్రీరామ్ చిన్నబాబు, ఆర్.జె వెంకటేష్, మధుబాబు, శ్రీపతి స్థానిక టిడిపి నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి ఆలయం వద్ద పోలీసుల బందోబస్తు నిర్వహించారు.

సౌదీ బస్సు ప్రమాదంపై పలువురి దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంపై వైసిపి రాష్ట్ర ప్రచార ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉమ్రా యాత్రలో భాగంగా మక్కా నుంచి మదీనా వెళ్తున్న భారతీయ ఆర్థికల బస్సు అగ్నిప్రమాదానికి గురికావడం, అందు లో ప్ర ప్రయాణిస్తున్న 65 మంది ప్రాణాలను కోల్పోవడం పట్ల ఆయన తీవ్ర విచారణ వ్య క్తం చేశారు, మృతుల కుటుంబాలకు శ్రీకాంత్‌రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. **యాత్రికుల మృతి బాధాకరం..** సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కా నుంచి మదీనకు వెళ్తున్న యాత్రికులు బస్సు ప్రమాదంలో చనిపోవడం చాలా బాధాకరమని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు వైసిపి జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు బేపారి మహమ్మద్‌ఖాన్ అన్నారు. **రాయచోటి :** సౌదీ అరేబియాలో బస్సు ట్యాంకర్ ఢీకొని ప్రమాదంలో 42 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరం అని రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. మక్కా నుంచి మదీనా వెళ్తున్న మార్గంలో జరిగిన ఈ దుర్ఘటనలో హైదరాబాద్‌కు చెందిన వారు మరణించిన విషయం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులుగా సుదర్శనం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

యమలా సుదర్శనం

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ యమాల సుదర్శనం ఎన్నికయ్యారు. పట్టణంలోని సిఎస్ఐ జెసిఎ కమ్యూనిటీ హాల్లో సోమవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా యమలా సుదర్శనం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గడ్డం నాగముని, ఉపాధ్యక్షులుగా లింగం సంజీవి మాధురి, మాధవ్, ఎ.ఆర్.అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా స్వర్ణ వెంకయ్య, సహాయ కార్యదర్శులుగా కొప్పుల రామచంద్ర, వీరేష్, గట్టు రామలింగం ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శులుగా మాడ పోతుల రాము, చెరుకూరి గంగులయ్య, శివారిపల్లి సుధాకర్, తుమ్మల ధరణి, రాష్ట్ర అధికార ప్రతినిధిగా పూతలపట్టు ప్రభాకర్, కోశాధికారిగా ఎస్‌టిడి హరి, మీడియా ప్రతినిధిగా వడిగల శేఖర్ బాబు, కార్యవర్గ సభ్యులుగా చింతపర్తి శివయ్య, అలగడ్డ ముని, బందర్ రవిశంకర్, బల్లి వెంకయ్య, దాసనంపల్లి శివయ్య, ఎం ఎన్ మూర్తి, గుమ్మగట్ట ఈశ్వరయ్య, సూర్య నారాయణ, యం వెంటస్వామి, చింతపర్తి శ్రీనివాసులు, అంజిబాబు, వివి రమణ, నారాయణ స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం మాలల సమస్యలపై అనునిత్యం స్పందిస్తూ, పరిష్కరించే దిశగా తమవంతు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు ప్రమాణం చేశారు.

సర్వే పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి-రామాపురం

కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా మండలంలో చేపడుతున్న సర్వే పక్కాగా నిర్వహించాలని జిల్లా పారామెడికల్ అధికారి రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆయన మండలంలో నిర్వహిస్తున్న కుష్టు వ్యాధి సర్వేపై తనిఖీ నిర్వహించారు. సందర్భంగా ఆయన రికార్డులు ఎల్‌సిడిసి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరినీ నిశ్చితంగా పరిశీలించాలన్నారు. శరీరంలో ఎక్కడైనా బంగారు రంగులో మచ్చలుంటే వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. పభుత్వం అందజేస్తున్న మందులు సక్రమంగా వాడుతున్నారా లేదా పరిశీలించాలన్నారు. ఈ సర్వే ఈనెల 30 వరకు జిల్లాలో నిర్వహిస్తామన్నారు. కుష్టు వ్యాధి బాధితుల పట్ల ప్రేమానురాగాలు చూపించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దివ్యశ్రీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా పారామెడికల్ అధికారి రవికుమార్

ఆడపిల్లలను రక్షిద్దాం..చదివిద్దాం

నిమ్మనపల్లె : సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ రమేష్ బాబు

ప్రజాశక్తి - నిమ్మనపల్లె

ఆడపిల్లలను కాపాడి వారిని చదివిద్దామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, కుసుమరాణి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో 'భేటీ బచావో బేటి పడావో'పై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒ నారాయణ, ఎఒ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లల లింగ నిష్పత్తిని కాపాడడం వారికి విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'భేటీ బచావో బేటి పడావో' కార్యక్రమం తీసుకువచ్చిందన్నారు. బాలికలు లింగ నిష్పత్తిని అధిగమించి తమ కలలను సహకారం చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమం బాలికల హక్కు, విద్య, గౌరవాన్ని అందించడంలో ఎంతో ఉపయోగపడిందని చెప్పారు. లింగ సమానత్వం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, దీనిపై విస్తృతంగా ప్రచారవం చేయాలని సూచించారు. నేటి సమాజంలో బాలికలు ఇతరులతో సమానంగా ప్రతి రంగంలోనూ ఉన్నతంగా రాణిస్తూ ఎన్నో మైలురాయిలను అధిగమిస్తున్నారని కొనియాడారు. బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టడానికి కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు కూడా ఆడపిల్లలు సాధిస్తున్న ఘనతలను గుర్తించి వారికి భవిష్యత్తు స్వేచ్ఛను ఇవ్వాలన్నారు. మిషన్ శక్తి, మిషన్ వాస్తల్య, బాల్య వివాహాలు అరికట్టడం, లింగ సమానత్వం, బాలికల హక్కులు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎపిఎం మురళి, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువు: ఆడపిల్లలు చదువుతో పార్టీ అన్ని రంగాలలో రాణించేలా కృషి చేయాలని బి.కొత్తకోట ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ భాగ్యమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో భేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు అన్ని రంగాలలో రాణించేలా ఎదిగేలా కృషి చేయాలన్నారు. ఆడపిల్లలను రక్షించాలి ఆడపిల్లలను కాపాడాలనే నినాదంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు భేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఆడపిల్లలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. బాల్యంలో వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలు ఇబ్బందుల గురించి తెలియజేశారు. ఆడపిల్లలను తల్లిదండ్రులు చిన్నచూపు చూడకుండా చదివించడం వారిని మగ పిల్లల లాగా సమానంగా చూడాలని తెలిపారు. ఆడపిల్లలు క్రమశిక్షణతో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ కరీమాబీ, పాఠశాల ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో పరిశ్రమలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

రెండు రోజుల కిందట వైజాగ్‌లో నిర్వహించిన సిఐఐ సదస్సులో సుమారు రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రంలో పెట్టేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధి చెందిన ఎన్నో కంపెనీలు ముందుకొస్తున్నాయని, అందులో రెండు, మూడు పరిశ్రమలైనా రైల్వే కోడూరు ప్రాంతంలో పెట్టాలని టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు కారకులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌కు కోడూరు ప్రజల తరఫున ఆయన అభినందనలు తెలియజేశారు. రైల్వే కోడూరు వాసిగా ఇది తన విన్నపంగా భావించి రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు విభజిస్తామని చెప్పారని అందులో భాగంగా రైల్వేకోడూరు కూడా కేటాయిస్తే బావుంటుందని పేర్కొన్నారు. కోడూరు ప్రాంత ప్రజలు జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు, లేదా కూలీ పనులకు వెళ్తున్నారని పేర్కొన్నారు. తిరుపతికి అతి సమీపంలో ఉన్న కోడూరులోనూ పెట్టుబడులు పెడితే తమ ప్రాంత ప్రజలకు శాశ్వతమైన విముక్తి లభిస్తుందని అన్నారు. కోడూరు పైన ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. ఐదేళ్లల్లో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు భయపడేవారని, వచ్చిన కంపెనీలు కూడా వారి అరాచకాలకు దాష్టీకానికి భయపడి పారిపోయే పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. ఉదాహరణకు రాష్ట్ర నడిబొడ్డున ఉన్న అమర రాజా కంపెనీ కూడా రాష్ట్రం విడిచిపెట్టి వెళ్లే పరిస్థితులు మనం చూశామని చెప్పారు. అలాంటి పరిస్థితుల నుంచి ఈరోజు గూగుల్ లాంటి సంస్థలు రాష్ట్రం వైపు చూస్తున్నాయంటే అది ముఖ్యమంత్రి చొరవేనని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు నాయకుడు నారా లోకేష్ చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ ఎన్నో దేశాలు తిరిగి పారిశ్రామికవేత్తలను కలుస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి నట్టేట ముంచిందని, అప్పులన్నీ స్కామ్‌ల రూపంలో దిగమింగరని ఆరోపించారు. రాష్ట్రం గురించి గాని, ప్రజల గురించి గాని మాట్లాడే నైతిక హక్కు వారికి లేదన్నారు. కూటమి పెద్దలు కోడూరుపై ప్రత్యేక శ్రద్ధ చూపి కనీసం రెండు మూడు పరిశ్రమలైన ఏర్పాటు చేయాలని ఆయన వేడుకున్నారు.

రాయచోటి-పింఛా రహదారి పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా లోని రాయచోటి-పింఛా ప్రధాన రహదారి ప్రస్తుతం తీవ్రంగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులు పూర్తి చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజుల భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద కార్యకర్తలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి గుంతలు, చీలిన భాగాలు, ప్రమాదకర స్థితి కారణంగా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు రోజూ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని వాపోయారు. జిల్లాలోని రైతుల సాగు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఝరికోన ప్రాజెక్టు ద్వారా అందుబాటులో ఉన్న నీటిని సమీప చెరువులకు మళ్లించాల్సిన అత్యవసరం ఉందని తెలిపారు. కుప్పం ప్రాంతానికి హంద్రీ-నీవా కాలువ ద్వారా సాగునీరు అందించిన ఉదాహరణను ప్రస్తావిస్తూ, అదే విధంగా అన్నమయ్య జిల్లాలోని చెరువులకు కూడా నీటిని మళ్లిస్తే రైతులకు భారీగా లాభం చేకూరుతుందని తెలిపారు. రాయచోటి-ఫించా ప్రధాన రహదారిని అత్యవసర ప్రాతిపదికన తక్షణమే పునరుద్ధరించి, సానిపాయి-సుండుపల్లి రహదారిని యుద్ధ ప్రాతిపదికన పునర్‌నిర్మించాలని డిమాండ్ చేశారు. ఝరికోన ప్రాజెక్టు నీటిని జిల్లాలోని రైతులకు అందించేందుకు సంబంధిత విభాగాలు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. హంద్రీ-నీవా కాలువల మాదిరిగా జిల్లాలోని చెరువులకు నీటిని మళ్లించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని, జిల్లా అభివృద్ధి కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని జెసికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకాష్, డిసిసి అధికార ప్రతినిధి మన్సూర్ ఆలీఖాన్, డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్, జిల్లా ఉపాధ్యక్షులు దర్బార్‌బాష, చెన్నక్రిష్ణ, జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ దుగ్గనపల్లి సురేంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షులు బాబా సర్దార్, సుండుపల్లి మండల అధ్యక్షులు సల్మాన్, వీరబల్లి మండల అధ్యక్షులు రెడ్డెయ్య రాజు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీసేది గ్రంథాలయాలే

మాట్లాడుతున్న వేంపల్లి అబ్దుల్ ఖాదర్

ప్రజాశక్తి - కలికిరి

విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసేదానికి గ్రంథాలయాలు చాలా ఉపయోగపడతాయని ప్రముఖ కవి, ఎస్‌వియు పాలకమండలి మాజీ సభ్యులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయ అధికారి అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వేంపల్లె ఖాదర్, విశిష్ట అతిథులుగా ఎంఇఒ- 2 నాగార్జున, సదుం మండల ఇన్‌ఛార్జి ఎంఇఒ నటరాజ, తెలుగు అధ్యాపకులు కలికిరి మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కవివేంపల్లి అబ్దుల్ ఖాదర్ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఒక పూలవనం లాంటిదని పూలు ఏ విధంగా పరిమిలిస్తాయో ఆ విధంగా విద్యార్థులు మంచి నడవడిక, క్రమశిక్షణతో ఉండటం ద్వారా నేటి సమాజంలో గొప్ప పౌరుడిగా ఎదుగుతారని చెప్పారు. వారి జీవితంలో గ్రంథాలయంలో ఎక్కువసేపు గడిపి గ్రంథాల అధికారి సమయం మించిపోతుందని గుర్తు చేసేంతవరకు చదివే వారని తన విద్యార్థి జీవితాన్ని గుర్తు చేసుకున్నారు. కుక్క పిల్ల, అగ్గిపుల్ల, సబ్బు బిళ్ళ కాదేవి కవిత కనర్హమని ఆయన అన్నారు. ఆయన రాసినటువంటి రచన విద్యార్థుల పైన బిడ్డలు అనే పుస్తకం చాలామంది విద్యార్థులు జీవితంలో ప్రేరణను నింపాయని తెలియజేశారు. గ్రంథాలయాలు కేవలం గ్రంథాలను భద్రపరిచే స్థలాలే కాకుండా విద్యార్థులకు విజ్ఞానాన్నిచ్చే భాండాగారాలుగా, వ్యక్తిత్వాన్ని పెంపొందించే సోపానాలుగా ఉపయోగపడుతున్నాయని ఆయన తెలియజేశారు. జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆంగ్లేయ అధికారి సిపి బ్రౌన్ తెలుగు భాషకు చేసినటువంటి విశేషమైన కృషిని గుర్తు చేశారు. ఆంగ్లేయుడైనప్పటికీ ఆయన తెలుగు భాష మీద పట్టు సాధించి తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. వేమన పద్యాలని వాడుకునేకి తీసుకొచ్చినటువంటి ఘనత ఆయనకు చెందుతుందని అన్నారు. ఎంఇఒ నాగార్జున మాట్లాడుతూ తన దినచర్య పత్రికలు చదవడంతో ప్రారంభమై పుస్తకాలు చదవడంతో ముగుస్తుందని అన్నారు. ఆయన ఉద్యోగం కోసం చేస్తున్న ప్రయత్నంలో గ్రంథాలయాలు చాలా ఉపయోగపడ్డాయని తద్వారా ఆయన ఉద్యోగం సాధించానని, ఉన్నత పదవులు చేరుకోవడానికి గ్రంథాలయాలు చాలా సహకరించాయని అన్నారు. బాలుల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నటరాజు మాట్లాడుతూ విద్యార్థులు చేతులకు ఆభరణం గ్రంథాలని, అవి సామాన్యులని, మేధావులుగా మార్చే నిలయాలని, గుడి కన్నా గ్రంథాలయం మిన్న అని, ఒక గుడి వెయ్యి మంది బిక్షగాలను తయారు చేస్తే, ఒక గ్రంథాలయం వంద మంది మేధావులు తయారు చేస్తుందన్నారు. కార్యక్రమానికి టిడిపి మండల ప్రెసిడెంట్ షాబుద్దీన్, రమేష్ బాబు, పాఠకులు, శ్రీనివాస కాలేజ్ విద్యార్థు గ్రంథాలయ సిబ్బంది హాజరయ్యారు.

రచ్చబండ కార్యక్రమాలకు తరలిరావాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్ర ప్రభుత్వం పిపిపి విధానం ద్వారా చేపడుతున్న మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి అధిష్టానం రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటి సంతకాల సేకరణకు పిలుపునిచ్చిందని నిమ్మనపల్లి మండల వైసిపి అధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం మదనపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ నిమ్మనపల్లి మండలంలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు చల్లావారిపల్లె, 11 గంటలకు నల్లంవారిపల్లె, మధ్యాహ్నం 12 గంటలకు వెంగంవారిపల్లె, 2 గంటలకు సామకోటవారిపల్లె, 3 గంటలకు అగ్రహారం, 4 గంటలకు నిమ్మనపల్లెలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. మండలంలోని వైసిపినాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సంతకాలను చేయాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బి.కొత్తకోట : వైసిపి అధిష్టానం పిలుపు మేరకు గవర్నమెంట్ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటిసంతకాల సేకరణ కార్యక్రమాన్ని తంబళ్లపల్లె నియోజకవర్గం, పెద్దతిప్ప సముద్రం మండలంలోని బూచిపల్లె వద్ద మంగళవారం ప్రారంభించనున్నట్లు నియోజవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డిహరి, పెద్దతిప్పసముద్రం మండల అధ్యక్షుడు మంజునాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. బూచిపల్లి, సంపతికోట, మల్లెల పంచాయతీలలో జరుగుతుందని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను వివరించడం జరుగుతుందన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు వైఎస్ఆర్ అభిమానులు, మహిళా నాయకులు, యువనాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఎరువుల దుకాణాల్లో ఎడిఎ తనిఖీ

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని ఎరువుల దుకాణాలన్నిటినీ ఎడిఎ కె.శ్రీలత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, గోడౌన్లలో ఉన్న స్టాకులను పరిశీలించారు. రికార్డులు సరిగ్గా లేని, స్టాక్‌లు, ఓ ఫారంలో లేని స్టాక్‌కు 5878కు స్టాఫ్ సేల్స్ నోటీస్ ఇవ్వడం జరిగిందాని తెలిపారు. రెండు రోజుల్లో ఓ ఫార్ములాలిన్ని ఇంటిలిజన్లోకి తీసుకురాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రైతులు బిల్లులను తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని ఎం.హేమలత, ఎఇఒ ఇంద్ర పాల్గొన్నారు.

సర్వే నిర్వహిస్తున్న విద్యార్థులు

సేవా కార్యక్రమాల్లో వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-కలికిరి

వ్యవసాయ కళాశాల విద్యార్థులు కెవికె ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు మేడుకుర్తి గ్రామంలో ప్రారంభించారు. శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతి ఆధ్వర్యంలో వారం రోజులపాటు జాతీయ సేవా కార్యక్రమాలు ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే నిర్వహించనున్నట్లు కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. మొదటి రోజులో భాగంగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రంలో నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన తరువాత ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ ఈ ఏడు రోజుల్లో జరగనున్న కార్యక్రమాలను వివరించారు. అసోసియేటివ్ డీన్ రేప్రజెంటేట్ డాక్టర్ జ్యోతి విద్యార్థులలో సామాజిక సేవను ఈ కార్యక్రమం ద్వారా పెంపొందించవచ్చని పేర్కొన్నారు. కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ మాధురి, డాక్టర్ పీరుసాహెబ్ పాల్గొంటూ గ్రామంలో సమస్యలను తెలియజేయవలసినదిగా కోరారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ నాగవేణి మాట్లాడుతూ గ్రామం తరపున తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శి సతీష్, స్వాతి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రామంలో విద్యార్థులు సామాజిక, ఆర్థిక సర్వేను నిర్వహించి గ్రామ పరిస్థితులను అంచనా వేసి రానున్న రోజుల్లో చేపట్టవలసిన కార్యక్రమాల ప్రణాళికను సిద్ధం చేశారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

ప్రజాశక్తి-రామాపురం

కర్నూల్ - చిత్తూరు 40వ జాతీయ రహదారి మండల పరిధిలోని బండపల్లి టోల్గేట్ సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయ క్రాస్ వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో కోటకొండ పెద్ద రెడ్డయ్య (57) అనే రైతు మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె చెందిన పెదరెడ్డయ్య తాను పండించిన కూరగాయలను రాయచోటి మార్కెట్‌కు ఆటోలో మరో వ్యక్తితో కలిసి తరలించడానికి బయలుదేరారు. ఆంజనేయస్వామి దేవాలయం క్రాస్ వద్దకు రాగానే వెనుక వైపు నుండి కారు ఓవర్ టేక్ చేయబోయి ఎదురు వస్తున్న లారీని తప్పించే క్రమంలో ఆటోకు ముందు భాగంలో ఢీకొంది. ప్రమాదంలో ఆటోలో ఉన్న పెద్ద రెడ్డయ్య కింద పడడంతో తలకు గాయమైంది. అదే కారులో అతన్ని రాయచోటికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోలాట బృందం కళాకారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

కార్తీకమాసం సందర్భంగా సోమవారం మల్లయ్యకొండ భక్తుల శివనామస్మరణలతో మార్మోగింది. రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున ఉదయమే స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. కార్తీక చివరి రోజు మహిళలు భారీ సంఖ్యలో కేదారేశ్వరి వ్రతం నోచుకున్నారు. ఆలయం ముందు కార్తీకదీపాలను వెలిగించే మొక్కలు తీర్చుకున్నారు. ఆలయానికి దిగువన ఉన్న వెలుగు మల్లమ్మకు అమ్మవారికి పూజారి శేఖర్ విజయనిర్మ ప్రత్యేక అలంకరణతో వెలుగు మల్లమ్మను అలంకరించారు. అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. కోలాటం బృందం శ్రీశ్రీ లక్ష్మి వెంకటేశ్వర బృందం ముట్లవారి పల్లి గ్రామం, అన్నమయ్య జిల్లా, బృందం అమ్మవారి ముందు శివయ్య ముందు నాట్య ప్రదర్శనలు కోలాటాలు నిర్వహించారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఈ నెల 17 నుండి 26వ తేదీ వరకు పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ 5-15 ఏళ్ల పిల్లల బయోమెట్రిక్, ఇతర వివరాలు అప్‌డేట్ చేసుకునేందుకు వీలుగా క్యాంపులు ఉంటుందన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ ఆధార్ కేంద్రం అందుబాటులో ఉంటుందని, మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రైం కార్నర్

మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్



బుజ్జమ్మ (ఫైల్ ఫొటో)

మండలంలోని సిటిఎం క్రాస్ రోడ్డులో మహిళ దారుణ హత్యకు గురైంది. ఆగంతకులు గొంతుకు టవల్ బిగించి, ముఖంపై దారుణంగా కొట్టి హత్య చేసినట్లు తెలిసింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. సిటిఎం క్రాస్ రోడ్డులోని పాకాల వీధికి చెందిన భూమల గడ్డోళ్ల అంజనప్ప భార్య సావిత్రమ్మ అలియాస్ బుజ్జమ్మ (48) వీధినాటకాలు వేసుకుంటూ జీవనం సాగించేది. ఈమెకు కుమారుడు ఆదిత్య, కుమార్తె కవిత ఉన్నారు. ఆదివారం రాత్రి 9.30లకు బహిర్భూమికి ఇంటి వెనుకవైపు ఉన్న చెట్లలోకి వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాలేదు. సోమవారం ఉదయం విగత జీవిగా కనిపించిందని కుటుంబీకులు తెలిపారు. సావిత్రమ్మను ఎవరు హత్య చేశారు. ఎందుకు చేశారన్నది తెలియరాలేదు. ఈ మేరకు మదనపల్లె తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి పైనే అనుమానాలు

సావిత్రమ్మను కుమారుడే హత్య చేసి ఉంటాడని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మద్యానికి అలవాటు పడిన సావిత్రమ్మ కుమారుడు ఆదిత్య మేస్త్రీ, డ్రైవర్ పనికి వెళ్లేవాడు. టీవల పనులకు వెళ్లకుండా జులాయిగా తిరుగుతున్నాడు. పైగా తన వద్ద ఉన్న పాత బైక్‌ను ఇచ్చేసి రెండురోజుల కిందట షోరూమ్ బైక్ ను కొనుగోలు చేశాడు. దీంతో తల్లి సావిత్రమ్మ, మేనమామ హవుమంతప్ప అతన్ని మందలించారు. షోరూమ్ బైక్‌ను తిరిగి వెనక్కి ఇచ్చేసారు. దీంతో అతను అమ్మపై కక్ష పెంచుకున్నాడు. రాత్రి ఇంటి సమీపంలో స్నేహితులతో కలిసి మద్యం తాగుతుండగా అదే సమయంలో సావిత్రమ్మ బహుర్భూమి కోసం అటుగా వెళ్లడాన్ని గమనించి మద్యం మత్తులో తల్లిని హత్య చేసి ఉంటాడని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తల్లి హత్యకు గురై మృత్యువాత పడగా ఆదిత్య ఇంటి నుంచి పరారయ్యాడు. దీనికితోడు అతని సెల్ ఫోన్ స్విచాఫ్ చేసుకున్నాడు. అతనిపై ఇంకా అనుమానాలు బలపడుతున్నాయి. పోలీసులు కేసును పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.